క్లుప్తంగా

విద్యార్థినికి అభినందన



దేవీప్రియను అభినందిస్తున్న డీవైఈఓ బాలాజీ

ఏర్పేడు: నేషనల్ మీన్ మెరిట్ స్కాలర్‌షిప్ (ఎన్ఎంఎంఎస్) జాతీయస్థాయి పోటీ పరీక్షల్లో ప్రతిభ చూపిన మండలంలోని పాపానాయుడుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన దేవీప్రియను జిల్లా ఉప విద్యాశాఖాధికారి బాలాజీ బుధవారం అభినందించారు. 2023–24 విద్యా సంవత్సరంలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో అప్పటి 8వ తరగతి విద్యార్థిని ఎంపికైనట్లు చెప్పారు. 4 ఏళ్లపాటు విద్యార్థిని ప్రభుత్వం నుంచి ఒక్కో ఏడాదికి రూ.12 వేలు వంతున నగదును పొందనున్నట్లు వివరించారు. ప్రస్తుతం విద్యార్థిని పాఠశాలలో 9వ తరగతి చదువుతోందని తెలిపారు. నేను బడికిపోతా కార్యక్రమాన్ని జూలై 12 వరకు నిర్వహించి పాఠశాలలో వందశాతం నమోదుకు చేర్చాలని సూచించారు. మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించారు.

విద్యార్థులకు స్కూల్ కిట్ల పంపిణీ



స్కూల్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే ఆదిమూలం

నాగలాపురం: మండల కేంద్రంలోని వ్యాపార సంఘం కల్యాణ మండపంలో బుధవారం ఎంఈఓలు బాబయ్య, జనార్దనరాజు ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు స్కూల్ కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా విద్యార్థులకు కిట్లు అందజేశారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు చదువుకోవడానికి అవసరమైన అన్ని సౌకర్యాలు ప్రభుత్వం కల్పిస్తుందని, బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో డీవైఈఓ ప్రభాకర్ రాజు, తహసీల్దార్ నరసింహులు, ఎంపీడీఓ పీఎంకే బాబు, మండల కన్వీనర్ శ్రీనివాస యాదవ్, సీనియర్ నాయకులు ఎండీ కుమార్, సునీల్, నెల్సన్ మండేల్, ప్రణీత్, పార్థిబన్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పామాయిల్ తోటల పెంపకంతో ఆదాయం



సమావేశంలో మాట్లాడుతున్న మురళి

ఏర్పేడు: పామాయిల్ తోటల పెంపకంతో రైతులు మంచి ఆదాయాన్ని పొందవచ్చని త్రీఎఫ్ ఆయిల్‌పామ్ కంపెనీ ఏజీఎం మురళి అన్నారు. బుధవారం మండలంలోని సరస్వతి కండ్రిగలో పామాయిల్ తోటల పెంపకంపై రైతులకు అవగాహనా కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ ఉద్యానశాఖ సూచనల మేరకు పామాయిల్ తోటల పెంపకం చేపడితే దిగుబడులు పెరిగి ఆదాయం చేకూరుతుందని వివరించారు. తోటల పెంపకం, ప్రభుత్వ రాయితీలు తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. త్రీఎఫ్ ఆయిల్ పామ్ కంపెనీ క్లస్టర్ మేనేజర్ రాజేష్, ఏర్పేడు క్లస్టర్ మేనేజరు గురునాథం, రైతులు పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రతతో ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమలత

ఏర్పేడు: పరిసరాల శుభ్రత పాటిస్తేనే ఆరోగ్యంగా ఉంటారని ఎంఈఓ ప్రేమలత అన్నారు. బుధవారం మండలంలోని ఆమందూరు ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల తల్లిదండ్రులతో డయేరియాపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాలు, పాఠశాల పరిసరాల్లో మురుగునీటి కాల్వల్లో మురుగు నిల్వలు, మంచినీటి పైపులైన్లు, ఓవర్‌హెడ్ ట్యాంకుల వద్ద లీకేజీలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. మురుగునీటిలో దోమలు చేరే అవకాశాలు ఉన్నాయన్నారు. నీటిని వేడి చేసి చల్లార్చి తాగాలన్నారు. అతిసారంతో మృత్యువాత పడే అవకాశాలు ఉన్నట్లు వెల్లడించారు. డయేరియాపై ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు గ్రామస్తులకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ గుణ యాదవ్, హెచ్ఎం సంజీవయ్య, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డయేరియాపై అప్రమత్తత అవసరం



మదనంబేడు స్కూల్లో తాగునీటి ట్యాంకును శుభ్రం చేయిస్తున్న అధికారులు



బీఎన్ కండ్రీగ : ఎస్సీ బాలుర హాస్టల్‌లోని ట్యాంకును పరిశీలిస్తున్న వైద్యాధికారి దివాకర్

సత్యవేడు: వర్షాలు ప్రారంభమైన నేపథ్యంలో డయేరియా వ్యాధి సోకకుండా జాగ్రత్తలు తీసుకుని, అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని ఎంపీడీఓ చంద్రశేఖర్ అన్నారు. బుధవారం మండలంలో నాలుగు బృందాలుగా వైద్యులు డయేరియాపై పాఠశాలలు, గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా మదనంబేడు పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంపీడీఓ మాట్లాడుతూ పాఠశాలల్లో నీటి ట్యాంకులు శుభ్రం చేసి, కోరినేషన్ చేసిన అనంతరం తాగునీరు అందించాలని ఉపాధ్యాయులకు సూచించారు. పంచాయతీల్లో మురుగు కాలువలు, వీధులను శుభ్రం చేయించి, ఫినాయిల్ చల్లించాలన్నారు. కుళ్లిన, నిల్వ ఉంచిన ఆహార పదార్థాలు తినకూడదని సూచించారు. ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. గ్రామాల్లో మురుగు కాలువలు ఎప్పటికప్పుడు శుభ్రపరచాలని, తాగునీరు కలుషితం కాకుండా చర్యలు చేపట్టాలని పంచాయతీ కార్యదర్శులకు సూచించారు. కాచి వడపోసిన నీటినే తాగాలని డాక్టర్ గుణశేఖర్ సూచించారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకులు 15 రోజులకోసారి శుభ్రం చేయడంతోపాటు క్లోరినేషన్ చేసిన నీటిని అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ రామాంజనేయులు, ఎంఈఓ కే. రవి, ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ మురళీధరన్, ఉపాధ్యాయులు ఈబీ గురునాథం, పీహెచ్‌సీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కలుషిత నీటితోనే డయేరియా

బుచ్చినాయుడుకండ్రిగ: కలుషిత నీటిని తాగడంతోనే డయేరియా వచ్చే అవకాశం ఉందని, డయేరియా సోకకుండా తాగునీటి పైపులైన్లను మరమ్మతులు చేయాలని, తాగునీటి ట్యాంకులు క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓ త్రివిక్రమ్‌రావు తెలిపారు. బుధవారం ఆయన డిప్యూటీ తహసీల్దార్ చంద్రబాబునాయుడు, వైద్యాధికారి దివాకర్‌తో కలసి బుచ్చినాయుడుకండ్రిగలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, ఎస్సీ బాలుర హాస్టల్లోని విద్యార్థులకు డయేరియాపై అవగాహన కల్పించారు. అనంతరం ఆయా ప్రాంతాల్లోని తాగునీటిని పరీక్షించారు. ఎస్సీ బాలుర హాస్టల్‌లోని ట్యాంకు శుభ్రంగా లేదని, బోరు నుంచి డైరెక్ట్ పంపింగ్ ద్వారా వచ్చే నీటిని తాగాలని సూచించారు. వీఎస్ పురంలో పర్యటించి, తాగునీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయించారు. గ్రామంలోని పేడ దిబ్బలను తొలగించాలన్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి దివాకర్ మాట్లాడుతూ వర్షకాలం కావడంతో సీజనల్ వ్యాధులు, జ్వరాలు, డయేరియా విజృంభించే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని,



బుచ్చినాయుడుకండ్రిగ జెడ్పీ ఉన్నత పాఠశాలలో నీటిని టెస్టు చేస్తున్న అధికారులు

ముఖ్యంగా వర్షకాలం వచ్చే జబ్బులు రెండు రకాలుగా ఉంటాయని, అవి ఒకటి కలుషిత నీటి ద్వారా వచ్చే వ్యాధులు, రెండో రకం దోమల ద్వారా వచ్చే వ్యాధులని చెప్పారు. కలుషిత నీరు, ఆహార పదార్థాలను తీసుకోవడంతో టైఫాయిడ్, నీళ్ల విరోచనాలు తదితర వ్యాధులు వస్తాయని తెలిపారు. దోమల కారణంగా మలేరియా, వైరల్ ఫీవర్, డెంగీ, చికెన్ గున్యా తదితర వ్యాధులు వస్తాయన్నారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తి గత పరిశుభ్రత పాటిస్తే కొంత వరకు వ్యాధులను అరికట్టవచ్చన్నారు. వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ వేంకటేశ్వరు, తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి



గాంధీ గిరిజనకాలనీలో విద్యార్థి తల్లిదండ్రులతో మాట్లాడుతున్న ఉపాధ్యాయులు

బుచ్చినాయుడుకండ్రిగ: విద్యాహక్కు చట్ట ప్రకారం బడిఈడు పిల్లలు బడి బయట ఉండకూడదని, తప్పనిసరిగా పాఠశాలలో చేర్పించాలని కల్లివెట్టు జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రూపేష్‌కుమార్ తెలిపారు. బుధవారం ఆయన ఉపాధ్యాయులు యువశ్రీమురళి, నాదెండ్లమురళితో కలసి మొక్కల చేను, గాంధీ గిరిజన కాలనీలోని బడికి వెళ్లకుండా ఇంటి వద్దనే ఉన్న విద్యార్థుల ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులతో మాట్లాడి పాఠశాలకు పంపించాలని, పాఠశాలలో అడ్మిషన్ చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ బడుల్లో నాణ్యమైన విద్యతో పాటుగా ఉచితంగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్, బెల్ట్, నోట్‌బుక్స్, డిక్షనరీ, బూట్లు, సాక్సులు అందించడంతో పాటు రుచికరమైన పౌష్టికాహారం ప్రభుత్వం అందిస్తున్నట్లు తెలిపారు.

సబ్ స్టేషన్‌లో ఫిర్యాదుల స్వీకరణ

తొట్టంబేడు :తొట్టంబేడు మండలంలోని సబ్‌స్టేషన్ పరిధిలో ఫిర్యాదుల స్వీకరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తొట్టంబేడు ఏఈ బాలాజీ తెలిపారు. బుధవారం కన్నలి సబ్‌స్టేషన్‌లో విద్యుత్ వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీటర్ల మరమ్మతులు, విద్యుత్‌లైన్లు, విద్యుత్ బిల్లు అధికం, మీటర్ల మార్పు తదితర సమస్యల సత్వర పరిష్కారం కోసం ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. 27వ తేదీ బోనుపల్లి, 28వ తేదీ కొనతనేరి, 29వ తేదీ చియ్యవరం సబ్‌స్టేషన్ పరిధిలో ఫిర్యాదులు స్వీకరించనున్నట్లు ఆయన తెలిపారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థుల ప్రతిభ



పావని



గౌతమి

ఏర్పేడు: మండలంలోని పాపానాయుడుపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరం అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో విద్యార్థులు మార్కులు సాధించినట్లు కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపల్ అమరేశ్వర్‌రెడ్డి తెలిపారు. బుధవారం విడుదలైన ఇంటర్ సప్లిమెంటరీ ఫలితాల్లో కళాశాల విద్యార్థిని ఎంపీసీలో రెడ్డివారి పావని 470 మార్కులకు గానూ 449 మార్కులు, బైపీసీకి చెందిన కుడిమి గౌతమి 440 మార్కులకు గానూ 429 మార్కులు సాధించినట్లు చెప్పారు. విద్యార్థులు ప్రతిభ చూపడం పట్ల కళాశాల అధ్యాపకులు, విద్యార్థుల తల్లిదండ్రులు హర్షం వ్యక్తం చేశారు.

బాల్య వివాహాలను నిర్మూలిద్దాం



ర్యాలీ చేస్తున్న అంగన్ వాడీ టీచర్లు

నాగలాపురం: మండలంలోని బీసీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీదేవి, సీడీపీఓ శోభారాణి ఆధ్వర్యంలో బాల్య వివాహం, నేను బడికి పోతా, డయేరియా తదితర అంశాలపై అవగాహన సదస్సు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహం చేయడం చట్టరీత్యా నేరమని, అలాగే బడి ఈడు పిల్లను బడికి పంపాలని, మన చుట్టు పక్కల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని శుభ్రమైన నీటిని తాగడంతో డయేరియా తదితర వ్యాధుల నుంచి ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు.కార్యక్రమంలో అంగన్‌వాడీటీచర్లు,ఆయాలు పాల్గొన్నారు.

38 మందికి జరిమానా

తిరుపతి లీగల్: తిరుపతిలో మద్యం తాగి వాహనాలు నడుపుతున్న 15 మందికి ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున జరిమానా విధిస్తూ తిరుపతి నాల్గవ అదనపు జూనియర్ సివిల్‌జడ్జి గ్రంధి శ్రీనివాస్ బుధవారం తీర్పు చెప్పారు. తిరుపతి ట్రాఫిక్ డీఎస్పీ రమణ కుమార్ ఆదేశాల మేరకు ఎస్ఐలు సుబ్బారెడ్డి, చిన్న పెద్దయ్య, మహమ్మద్ బాబా, శ్రీరాములు ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో తనిఖీ లు నిర్వహించారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. అలాగే ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న 23 మందిపై ట్రాఫిక్ పోలీసులు కేసులు నమోదు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి వారికి రూ.4,600 జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

మాదిగల కవాతుకు కదలిరండి



తొట్టంబేడు మాదిగలతో ఎమ్మార్పీఎస్ నాయకులు

శ్రీకాళహస్తి: ఎమ్మార్పీఎస్ 30 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వరంగల్‌లో జూలై 7న జరగబోయే మాదిగల కవాతు కార్యక్రమానికి మాదిగలంతా కదలి రావాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ రాజా పిలుపునిచ్చాడు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో ఉన్న నాలుగు మండలాల్లో మాదిగలను కలిసి కార్యక్రమానికి హాజరు కావాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం తొట్టంబేడు మండల అధ్యక్షుడు కే.బాలు అధ్యక్షతన తొట్టంబేడు మండలంలో మందకృష్ణ మాదిగ పిలుపును వినిపించారు. కార్యక్రమంలో శ్రీకాళహస్తి నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మన్నేపల్లి ఈశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మార్పీఎస్ పట్టణ అధ్యక్షుడు గాజుపాకుల యతీష్, శ్రీకాళహస్తి పట్టణ యువసేన అధ్యక్షుడు పాలూరి వెంకటముని, ఎమ్మార్పీఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు గ్లకోమా ఉచిత వైద్యశిబిరం

తిరుపతి తుడా: స్థానిక శ్రీ సాయిసుధా కంటి ఆస్పత్రిలో గురువారం గ్లకోమా ఉచిత వైద్యశిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆస్పత్రి అధినేత్రి డాక్టర్ సుధారాణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు.

నేటి నుంచి శ్రీసుందరరాజస్వామి అవతార మహోత్సవాలు

చంద్రగిరి(తిరుచానూరు): తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆలయానికి అనుబంధంగా ఉన్న శ్రీసుందరరాజస్వామివారి అవతార మహోత్సవాలు గురువారం నుంచి శనివారం వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మూడు రోజులపాటు మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 4 గంటల వరకు శ్రీకృష్ణస్వామి ముఖమండపంలో శ్రీ సుందరరాజ స్వామివారికి వైభవంగా అభిషేకం నిర్వహిస్తారు. అనంతరం సాయంత్రం 5.45 నుంచి 6.15 గంటల వరకు శ్రీసుందరరాజస్వామివారికి ఊంజల్‌సేవ జరుగనుంది. రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు వాహనసేవ నిర్వహిస్తారు. శ్రీసుందరరాజస్వామి మొదటి రోజు పెద్దశేష వాహనం, రెండో రోజు హనుమంత వాహనం, చివరిరోజు గరుడ వాహనంపై మాడ వీధుల్లో విహరించి భక్తులకు దర్శనమిస్తారు. ఈ ఉత్సవాల సందర్భంగా మూడు రోజుల పాటు శ్రీపద్మావతీ అమ్మవారి ఊంజల్ సేవను రద్దు చేస్తున్నట్లు టీటీడీ అధికారులు ప్రకటనలో తెలిపారు.

దాడి చేసిన వారిని అరెస్ట్ చేయాలి

తిరుపతి కల్చరల్: చిత్తూరు జిల్లా, వెదురుకుప్పం మండలం, మారేపల్లి గ్రామంలో దళితులపై దాడి చేసిన వారిపై అట్రాసిటీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు యార్లపల్లి గోపి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. క్రికెట్ ఆడుతున్న దళిత యువకులపై వేణుగోపాలపురం, వావిల్‌చెరువుచేనుకు చెందిన అగ్రవర్ణాలు కరెంట్ పోల్‌కు కట్టివేసి దళిత యువతను దాడి చేసి గాయపరచడం దుర్మార్గమన్నారు. దాడికి పాల్పడిన వారిపై పోలీసులు తక్షణమే ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నేతలు శాంతి యాదవ్, వెంకటేష్ గౌడ్, భానుప్రకాష్, నాగరాజు, నవీన్‌భాస్కర్ పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలు విడుదల చేయండి



ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్‌కు వినతి పత్రం అందజేస్తున్న నేతలు

తిరుపతి సిటీ: ఎస్వీయూ పరిధిలో గత ఏడాది అక్టోబర్ నెలలో నిర్వహించిన డిగ్రీ బీకామ్ 3వ సెమిస్టర్ రీవాల్యుయేషన్ ఫలితాలను వెంటనే విడుదల చేయాలని ఏఐడీఎస్ఓ విద్యార్థి సంఘం నేతలు డిమాండ్ చేశారు. బుధవారం వర్సిటీలో ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ చంద్రయ్యకు వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫలితాలు సరైన సమయానికి విడుదల చేయకపోవడంతో విద్యార్థులు నష్టపోతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా డిగ్రీ 3వ సెమిస్టర్ సప్లిమెంటరీ పరీక్షలు జనవరి మాసంలో జరిగితే ఇంతవరకు ఫలితాలు విడుదల కాలేదన్నారు. పెండింగ్‌లో ఉన్న ఫలితాలను వెంటనే విడదల చేయాలని వారు డిమాండ్ చేశారు. ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ నగర అధ్యక్షుడు వి.వెంకటసుబ్బయ్య, నేతలు, విద్యార్థులు పాల్గొన్నారు.

డ్రోన్‌తో కూలీల సమస్యకు చెక్



డ్రోన్‌తో మందు పిచికారీపై అవగాహన కల్పిస్తున్న కేవీకే శాస్త్రవేత్తలు

రేణిగుంట: వ్యవసాయంలో డ్రోన్లను వినియోగించడం ద్వారా కూలీల సమస్యను అధిగమించవచ్చని వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ(ఆత్మ) ఏడీ రత్నప్రసాద్ అన్నారు. చిత్తూరు ఆత్మ సహకారంతో రాస్ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు బుధవారం మండలంలోని కరకంబాడి పంచాయతీ గొల్లపల్లిలో వరి పంటలో డ్రోన్‌తో మందు పిచికారీపై రైతులకు అవగాహన కల్పించారు. కేవీకే శాస్త్రవేత్త డాక్టర్ రాముకుమార్ పాల్గొని డ్రోన్లతో క్రిమి సంహారక మందుల పిచికారీ చేసే విధానం, లాభాలను గురించి వివరించారు. డ్రోన్‌తో ప్రయోగాత్మకంగా ఓ రైతు పొలంలో మందును పిచికారీ చేసి చూపించారు. ఆయన మాట్లాడుతూ కేవలం ఆరు నుంచి 8 నిమిషాల వ్యవధిలోనే 10 లీటర్ల నీటితో ఒక ఎకరా పంటకు పిచికారీ చేయవచ్చన్నారు. దీంతో కూలీల సమస్య అధిగమించడమే కాకుండా క్రిమిసంహారక మందు మోతాదు 20నుంచి 25 శాతం తగ్గుతుందన్నారు. పురుగు మందు ప్రభావం కూడా సాధారణ పద్ధతి కంటే ఎక్కువ ఫలితాలను ఇస్తుందని చెప్పారు. దీనికి తోడు సమయం ఆదా అవుతుందని తెలిపారు. గ్రామాల్లో రైతులు గ్రూపులుగా ఏర్పడి డ్రోన్‌లను తెచ్చుకుని వాడుకుంటే లాభసాటిగా ఉంటుందని సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి వేణు, రైతులు పాల్గొన్నారు.

మాదక ద్రవ్యాలతో జీవితాలు నాశనం



విద్యార్థులకు సూచనలు చేస్తున్న న్యాయవాది రాజేశ్వరరావు

శ్రీకాళహస్తి: మాదక ద్రవ్యాల వల్ల ఎక్కువగా విద్యార్థులు బలైపోతున్నారని సీనియర్ న్యాయవాది గుమ్మల రాజేశ్వరరావు అన్నారు. అంతర్జాతీయ మాదక ద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పట్టణంలోని సరస్వతి బాయ్స్ హైస్కూల్‌లో బుధవారం న్యాయవిజ్ఞాన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా న్యాయవాది మాట్లాడుతూ ఈ మధ్య కాలంలో హెరాయిన్ వంటి మత్తు పదార్థాలు ఎక్కువగా దొరుకుతున్నాయని దానివల్ల ముఖ్యంగా విద్యార్థులు బలైపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మత్తు పదార్థాలు విక్రయిస్తూ అనుమానంగా వ్యక్తులు తారసపడితే వెంటనే సమీపంలోని హెడ్మాస్టర్‌కు గానీ, మీ తల్లిదండ్రులకు గానీ 100కు డయల్ చేసి పోలీసులకు ఫిర్యాదు చేయాలని తెలియజేశారు.

ప్రతి విద్యార్థి కూడా మంచి అలవాటుతో విద్య మీద దృష్టి సారించి ఉన్నతస్థాయికి ఎదగాలని సూచించారు. విద్యార్థి దశలో మత్తు పదార్థాలకు బానిస అయిపోతే ఇంకా వారి జీవితాలు నాశనమైపోతాయని హితవు పలికారు. కార్యక్రమంలో న్యాయవాదులు శ్రీరామ్ మల్లికార్జున్ పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు

విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరం



విద్యాసామగ్రి పంపిణీ చేస్తున్న ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య

శ్రీకాళహస్తి: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాభివృద్ధికి దాతల సహకారం అవసరమని మండల విద్యాశాఖ అధికారులు భువనేశ్వరి, బాలయ్య అన్నారు. శ్రీకాళహస్తి మండలం పెద్దమిట్టకండ్రిగ ప్రాథమిక పాఠశాలలో బుధవారం స్థానిక దాత శివకుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఉచితంగా విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా విచ్చేసిన ఎంఈఓలు భువనేశ్వరి, బాలయ్య విద్యార్థులకు నోటు పుస్తకాలు, పలకలు తదితర విద్యాసామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన పిల్లలే ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్నట్లు తెలిపారు. అలాంటి విద్యార్థులకు దాతలు ముందుకు వచ్చి తమవంతు సహకారం అందించడం అభినందనీయం అన్నారు. ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు సహకారం అందించేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో పాఠశాల కమిటీ చైర్మన్ మురుగారెడ్డి, ఉపాధ్యాయులు హరినాథ్ అబ్దుల్ హమీద్, సీఆర్పీ హేమలత, గ్రామస్తులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డయేరియా కేసులపై నిర్లక్ష్యం వద్దు



చిన్నారి దర్శిని మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నూకతోటి రాజేష్

వరదయ్యపాళెం: కేవీబీపురం మండలంలో ప్రబలుతున్న డయేరియా కేసులపై ప్రభుత్వం తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ సత్యవేడు నియోజకవర్గ సమన్వయకర్త నూకతోటి రాజేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కేవీబీపురం మండలంలోని కాట్రపల్లి దళితవాడలో డయేరియా వ్యాధితో మృతి చెందిన చిన్నారి దర్శిని మృతదేహాన్ని సందర్శించి, శ్రద్ధాంజలి ఘటించారు. చిన్నారి తల్లిదండ్రులు కామాక్షి, దశ్వంత్ దంపతులను పరామర్శించి, ఓదార్చారు. తక్షణమే గ్రామంలో కలుషిత నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరారు. డయేరియా కేసులు అదుపులో వచ్చేంత వరకు స్థానికంగా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే మృతి చెందిన చిన్నారి కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు.

ఇలాంటివి పునరావృతం కాకుండా ఎప్పటికప్పుడు వైద్య సిబ్బంది ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. ఆయన వెంట వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గవర్ల కృష్ణయ్య, మహిళా విభాగం జిల్లా కన్వీనర్ బొర్రా మాధవిరెడ్డి, స్థానిక నాయకులు ఉన్నారు.

టీటీడీ పరిపాలనా భవనంలో పూజలు



ఈఓను కలిసి శుభాకాంక్షలు తెలుపుతున్న జేఈఓలు

తిరుపతి(అలిపిరి): తిరుపతిలోని టీటీడీ పరిపాలనా భవనంలో ఈఓ జె.శ్యామలరావు కార్యాలయంలో బుధవారం శాస్త్రోక్తంగా పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జేఈఓలు వీరబ్రహ్మం, గౌతమి స్వాగతం పలికారు. ఈఓను వేదపండితులు ఆశీర్వదించారు. అనంతరం టీటీడీ అధికారులు, ఉద్యోగులు ఈఓను మర్యాదపూర్వకంగా కలిశారు.

ఆటో డ్రైవర్‌పై మూకుమ్మడి దాడి



గాయపడిన సునీల్

నాయుడుపేట టౌన్: నాయుడుపేట మండలంలోని పండ్లూరు వద్ద బుధవారం కొందరు యువకులు ఆటో డ్రైవర్ సునీల్‌పై మూకుమ్మడిగా దాడి చేసి తీవ్రంగా గాయపరిచారు. పోలీసుల కథనం మేరకు.. అయ్యప్పరెడ్డిపాళెంకు చెందిన ముమ్మడి సునీల్ ఆటో నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఈ నెల 24న సునీల్ ఆటోలో పాలు తీసుకుని వస్తున్నాడు. పండ్లూరు వద్ద ఆటో మలుపు తిరుగుతుండగా అదే గ్రామానికి చెందిన సందీప్‌కు తగిలింది. దీంతో సునీల్, సందీప్ మధ్య గొడవ జరిగింది. బుధవారం సునీల్ పండ్లూరు గ్రామ సమీపంలోని ఓ దుకాణం వద్దకు వచ్చాడు. గమనించిన సందీప్, రమేష్ మరి కొంతమంది యువకులతో కలిసి సునీల్‌పై దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన సునీల్‌ను స్థానికులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.